# నమ్మకం

అందరూ అదేమాట. అరవిందకి మతిపోయిఉట్టింది.

* * *

ఆరేళ్ళ క్రితం ఆనందమూర్తిని పెళ్ళాడి అరవింద మెట్టినింట అడుగుపెట్టింది. పల్లెపట్నం కాని ఊళ్ళో ఎనిమిది వందలు సంపాదించే చిరుద్యోగంతో బాటే ఆనందమూర్తికి సొంతానికి ఓ పూరిల్లు కూడా ఉంది. ఆనందమూర్తికి అతని తండ్రి, అతనికోసం మిగిల్చిన ఏకైక ఆస్తి అది.

పసుపుబట్టల్తో అతని వెంట ఆ ఇంట్లో అడుగుపెట్టిన అరవింద గది మధ్యలో ఆధారంగా నిలబెట్టిన పుచ్చిపోయిన నిట్రాటను, చౌడు రాల్తున్న మట్టి గోడల్ని చూసి గతుక్కుమంది. వెంటనే ధైర్యం తెచ్చుకుంది. మర్నాటి నించే కొంగు బిగించి పనిలో దూకింది.

గోడలు చదునయ్యేలా మెత్తింది. నేల అలికి ముగ్గులుపెట్టింది. ఇంటి ముందున్న చాపంత వాకిలిని ఊడ్చి చదును చేసింది. వాకిలి అంచున నిరంతర జీవవాహినిలా ప్రవహిస్తున్న మురికి కాలువని ఏమీ చెయ్యలేక దిగాలు పడింది. కాలువను శుభ్రం చెయ్యబోయి దానిలోంచి ఝుమ్మని లేచిన దోమల ధాటికి తాళలేక విరమించుకుంది. కాలవ మీంచి లాంగ్ జంప్ చేసిన భర్తను గుర్తుకు తెచ్చుకుని చూరు పక్కనున్న పాత బల్లచెక్కొకటి వాకిలి అంచునించి రోడ్డుమీదికి వాల్చింది.

ఆ సందర్భంలో గుమ్మానికెదురుగా వాకిలి అంచున పేరు తెలీని రెండు జానల మొక్కొకటి కనిపించింది. ఏదో పిచ్చి మొక్కలే అని తుంచి పడెయ్యబోతే ఎంత గట్టిగా నేలలో వేళ్లూనుకుని ఉందో, ఆకులు మాత్రం తెగి చేతిలో కొచ్చాయి. తర్వాత తవ్వి పడెయ్యొచ్చులే అనుకుని దాని మాటే మరిచి పోయింది, రెండు వారాల తర్వాత చూస్తే ఆ మొక్క తుంచిన చోటునుంచి రెండు శాఖల్తో చిగురించి కన్పించింది. 'పోనీలే, అదేం చేసింది' అని వదిలేసింది.

ఏడాది నాటికే అది జయ్యిజయ్యిమని ఎదిగి పోయింది.

అరవింద మొదటి కాన్పుకి పుట్టింటికెళ్ళింది. పాపాయినెత్తుకుని వచ్చే సరికి ఏపుగా ఎదిగి వాకిలి నిండా ఆకులు రాల్చేసి కొత్త చిగుళ్లు వేస్తూన్న చెట్టును చూసి, చికాకు పడింది. పారబోయాలనుకున్నప్పుడు తెలిసింది ఆకులు పెళుసుగా ఉన్నాయని. చాన్నాళ్లు పాపాయి స్నానానికి నీళ్లు కాచడానికి ఉపయోగపడ్డాయవి. చిగుళ్ల వెంట లేత పచ్చని పూత, ఆ పైన గుత్తులు గుత్తులుగా ద్రాక్షకాయల్లా కాసిన కాపు చూసాక గానీ కుంకుడు చెట్టని అర్థంకాలేదు అరవిందకి.

"ఏవండీ, ఇది కుంకుడు చెట్టు" అంది సంభ్రమంగా ఆనందమూర్తితో.

"మరేం చెట్టనుకున్నావ్?" అని కాజువల్‌గా తిరిగి ప్రశ్నించి తన పని మీద వెళ్లిపోయాడు ఆనందమూర్తి.

అరవిందకి పాపాయి పుట్టిన ఆనందం పాతబడింది, తన వాకిట్లో తన కళ్లెదుట పెరిగిన చెట్టు దగ్గర దగ్గర అరబస్తా కాయలు కాయడం, అవి ఏడాది పాటు ముగ్గురికీ తలంటుకోడానికి ఉపయోగపడగా ఇంకా మిగిలి పోవడం, అంతా సంభ్రమంగా ఉంది.

రెండో కాపులో చెట్టు నిలదొక్కుకుని మరిన్ని కాయలు కాసింది. బస్తాతో బస్తాడుపైనే కాయలైనై. కుంచం నలభై లెక్కన కొనుక్కెళ్లడానికి వచ్చిన వ్యాపారి ఒకాయన "కుంకుడు చెట్టు ఏటికేడూ కాపు పెరుగుతుందమ్మా. కాయ మంచి ఒకటో రకం. ఎవరికీ ఇచ్చెయ్యకండి. ఎంత రేటుంటే అంతకీ నేనే కొనుక్కెళ్తుంటాను." అన్నాడు.

వ్యాపారి తన చేతిలో పెట్టిన వెయ్యి రూపాయల్ని నమ్మలేనట్టు చూసింది అరవింద.

చాలీ చాలని జీతంతో ఇబ్బంది పడకుండా ఆ దేవుడే ఈ చెట్టుని వాకిట్లో ప్రసాదించాడు అని నమ్మింది. డబ్బు పట్టుకెళ్లి గూట్లో దేవుడి ముందుంచి భక్తి పూర్వకంగా నమస్కరించింది. రెండో కాన్పుకి పుట్టింటి వాళ్లు పిలిచినా కుంకుడు

కాపు రోజులని వెళ్లడం మానేసింది. అలాంటి చెట్టునిప్పుడు నరికి పడెయ్యమని ఇంటికొచ్చిన ప్రతి ఒక్కరూ సలహాలిస్తుంటే అరవిందకి చేదు మింగినట్లుంటోంది. ఆనందమూర్తి ఆరోగ్యం మరో పక్క గుండెను పిండి చేస్తోంది.

ఏడాది క్రితం ఫ్యాక్టరీలో ప్రమాదం జరిగి నెల్లాళ్లు ఆస్పత్రిలో ఉన్నాడు ఆనందమూర్తి. ఆ తర్వాత ఇంటికొచ్చినా పూర్తిగా కోలుకోలేదు. మనిషి క్రమంగా నీరసించి పోయాడు. ఫాక్టరీకి పదిరోజులెళ్లీ, పదిరోజులెళ్లకా ఆర్నెల్లపాటు నెట్టుకొచ్చాడు. ఈ మధ్య మరీ లేవలేని తీరైపోయాడు.

అందు బాటులో ఉన్న డాక్టర్లందరికీ చూపించి మందులు వాడింది అరవింద. ఫలితం లేకపోయింది. అయిదు నక్షత్రాల ఆస్పత్రుల్లో చూపించండని కొందరు సలహా ఇచ్చారు అంత స్థోమతెక్కడిది?

ప్రమాదం జరిగినప్పుడు ఫాక్టరీ వాళ్లిచ్చిన పదివేలూ ఏనాడో ఖర్చైపోయాయి. అట్నుంచీ ఇట్నుంచీ ఆదుకోగల బంధు వర్గం ఎవరూ లేరు.

ఆనందమూర్తిని చూసిపోవడానికొచ్చే దూరపు బంధువులు, స్నేహితులూ ఒకటే పాట మొదలుపెట్టారు. "వాకిట్లో కుంకుడుచెట్టుండకూడదు. అరిష్టం. అందుకే ఇలా జరిగి ఉంటుంది" అని.

మొదట్లో ఆ సలహా ఇచ్చే వాళ్లందరికీ "తనదీ, తన పిల్లల్దీ ఖర్మమిలా కాలింది గానీ పచ్చని చెట్టేం చేసిందీ- అలా అయితే ఎన్నెన్ని ఏక్సిడెంట్లు జరగడం లేదు? ఎందరికి అనారోగ్యాలు ముంచుకు రావడం లేదూ? వాళ్లందరి ఇళ్ల ముందు కుంకుడు చెట్లున్నాయా? అని సమాధానమిచ్చేది అరవింద.

వినగా వినగా మేకపిల్ల కుక్క పిల్లైన చందమౌతోంది.

ఆనందమూర్తి పరిస్థితి క్రమంగా విషమిస్తోంది. కొత్తగా చిగుళ్లు తొడిగి ఆ సంవత్సరం అప్పుడే పూతకొస్తున్న కుంకుడుచెట్టును నరికించాలంటే గుండె కరిగి నీరవుతోంది. చేసేదేం లేక తన గుండెను రాయి చేసుకుంది అరవింద. పక్కింటి పరమయ్యను పిలిచి కట్టెలు అతనే తీసుకునే ఒప్పందం మీద చెట్టును నరికించేసింది.

ఎండవేళ నీడ నిచ్చింది. వాకిలికి అందాన్నిచ్చింది. అన్నిటినీ మించి ఆర్థికంగా ఆదుకుంది. అలాంటి పచ్చని చెట్టు నేల కూలడం చూడ లేక కళ్లు మూసుకుని కూర్చుండి పోయింది. మూసిన కనురెప్పల్లోంచి కుంకుడు గింజలంతేసి కన్నీళ్ళు ఆమె ఒడి లోని బిడ్డ తలని అభిషేకించాయి.

మర్నాడు బోసిపోయిన వాకిలిని చూసి, అరవింద హృదయం బావురుమంది. కుంకుడు చెట్టు వేళ్లను కూడా మిగల్చ లేదు పరమయ్య.

నెమ్మదిగా తనకు తనే నచ్చజెప్పుకుంది. చెట్టంత భర్త కోసమే కదా తనీ పాపానికి ఒడిగట్టింది. ఆయన మంచం లోంచి లేచి తిరిగితే అంతే చాలు!

మరో పది రోజుల తర్వాత పడుకున్న వాడు పడుకున్నట్టే నిద్రలో ప్రాణాలు వదిలాడు ఆనందమూర్తి.

*********

**కథాప్రభ (ఆంధ్రప్రభ 8/6/98)**